క్లుప్తంగా

వేడుకగా రక్షా బంధన్



సింహాచలం దేవస్థానం వేద పాఠశాలలో విద్యార్థులకు రాఖీలు కడుతున్న సోదరీమణులు

సింహాచలం: అన్నాచెల్లెలు అనుబంధానికి, ఆప్యాయతకు ప్రతీకగా నిలిచిన రక్షా బంధన్ వేడుకలను గురువారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. ఎటుచూసినా రాఖీ పండగ సందడి నెలకొంది. ఉదయం 8 గంటలకే పౌర్ణమిని తిథి వెళ్లిపోయినా సూర్యోదయానికి ఉన్న తిథినే లెక్కగా చూపిస్తూ సాయంత్రం వరకు రాఖీ పండగ జరుపుకున్నారు. మహిళలు, యువతులు, చిన్నారులతో రాఖీలు విక్రయించే స్టాళ్లన్నీ కళకళలాడాయి. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పాఠశాలలో వేద విద్యార్థులకు వారి తోబుట్టువులు తరలివచ్చి రాఖీలు కట్టారు. కేవలం తమ సోదరులకే కాకుండా పాఠశాలలో ఉన్న విద్యార్థులందరికీ చిన్నారులు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి ఆశీస్సులు పొందారు.

చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురి అరెస్ట్

సింహాచలం: విద్యార్థి మెడలో ఉన్న వెండి చైన్‌ను అపహరించిన ఘటనలో ముగ్గురిని పెందుర్తి క్రైం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పెందుర్తి ఎస్‌ఐ సల్మాన్‌బేగ్ తెలిపిన వివరాలిలా.. 94వ వార్డు కృష్ణరాయపురానికి చెందిన భార్గవ్ నరవలోని ఒక కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. గత నెల 28వ తేదీ సాయంత్రం కాలేజీ నుంచి వేపగుంట వచ్చి ఇంటికి నడిచివెళ్తున్నాడు. ఈ క్రమంలో ముగ్గురు వ్యక్తులు వచ్చి విద్యార్థి మెడలో ఉన్న చైన్, సెల్ ఫోన్‌ను లాక్కుని వెళ్లిపోయారు. ఈ విషయం తల్లిదండ్రులకు భార్గవ్ చెప్పడంతో వారు పెందుర్తి క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా దొంగతనానికి పాల్పడిన ముగ్గురిని ఎస్‌ఐ సల్మాన్‌బేగ్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కృష్ణా కళాశాలలో సంస్కృత దినోత్సవం



అధ్యాపకుడు ఉమామహేశ్వరరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సంస్కృత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సంస్కృతం అధ్యాపకుడు డాక్టర్ ఉమామహేశ్వరరావును ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సత్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సంస్కృతం మన ప్రాచీన భాష అని, అన్ని భాషలకు తల్లి లాంటిదని చెప్పారు. సమస్త సాహిత్యం సంస్కృతంలోనే ఇమిడి ఉందన్నారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు



శిక్షణ తరగతులను పర్యవేక్షిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

కంచరపాలెం: రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ హైస్కూల్ కాంప్లెక్స్‌లో పలు సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, సీఆర్‌పీ ఎల్.చైతన్య వీటిని పర్యవేక్షించారు. కంచరపాలెం, కప్పరాడ, తిక్కవానిపాలెం, ధర్మానగర్, కె.కాలనీ, సుభాష్‌నగర్, రాంజీ ఎస్టేట్ తదితర పాఠశాలలకు చెందిన సబ్జెక్ట్ టీచర్లు పాల్గొన్నారు.

రేపు హనుమాన్ చాలీసా పారాయణ

దాబాగార్డెన్స్ : నగరంలోని అప్పయ్యనగర్‌లో వేంచేసిన భూసమేత విజయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 2న వెంకటేశ్వర ఫౌండేషన్, అప్పయ్యనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అఖండ హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ ప్రతినిధి బి. హరినాథ్, శ్రీహరేరామ సంకీర్తన భక్త బృందం ఉపాధ్యక్షుడు ఎంవీ రాజశేఖర్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రావణ పౌర్ణమి సందర్భంగా గురువారం సింహగిరి వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేణ పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అష్టోత్తర శత నామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేష హారతులు సమర్పించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేణ పూజ, పుణ్యావాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

సింహాచలేశుడిని దర్శించుకున్న ప్రముఖులు



మాజీ మంత్రి పుష్ప శ్రీవాణికి ప్రసాదం అందజేస్తున్న ఏఈవో భ్రమరాంబ



ఆలయ అధికారులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులతో కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్

సింహాచలం: సింహగిరి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని గురువారం మాజీ మంత్రి పాముల పుష్ప శ్రీవాణి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని పుష్ప శ్రీవాణికి ఏఈవో భ్రమరాంబ అందజేశారు.

కర్నూలు ఎంపీ పూజలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని గురువారం కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. అప్పన్న దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని కప్పస్తంభాన్ని ఎంపీ ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో స్వామివారికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో హారతి సమర్పించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఏఈవో భ్రమరాంబ ఎంపీ దంపతులకు అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్ రాజ్, సువ్వాడ శ్రీదేవి, మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు సూరిశెట్టి సూరిబాబు ఎంపీ వెంట ఉన్నారు.


కులవివక్ష లేని సమాజం అందరి లక్ష్యం



మాట్లాడుతున్న సీఐ రంగనాథం

సబ్బవరం: ప్రజలంతా చట్టం దృష్టిలో సమానమేనని.. కులాల పేరుతో ప్రజల మధ్య తారతమ్యాలు ఉండకూడదని సీఐ రంగనాథం అన్నారు. మండలంలోని ఎల్లుప్పి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ మాట్లాడుతూ చట్టం దృష్టిలో దళితులు, ఉన్నత వర్గాలు అనే తేడా ఉండదన్నారు. కులవివక్ష లేని సమాజ నిర్మాణం మనందరి లక్ష్యం కావాలన్నారు. మరో ముఖ్య అతిథి తహసీల్దార్ బి. సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. దళితుల హక్కులు కాపాడేందుకు మనమంతా కృషి చేయాలన్నారు.

వీధికుక్కల బెడద



పరవాడ రోడ్డుపై సంచరిస్తున్న వీధికుక్కలు

పరవాడ: మండల కేంద్రం పరవాడలో వీధికుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల బెడదను నివారించడానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న శునకాలతో మహిళలు, విద్యార్థులు రోడ్ల మీదకు రావాలంటే బెంబేలెత్తిపోతున్నారు. మాంసం, చేపల దుకాణదారులు ఇష్టానుసారంగా వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయడం వల్ల వాటికి అలవాటు పడిన గ్రామ సింహాలు గ్రామాన్ని వీడి ఎక్కడికి వెళ్లకుండా తమ సంతతిని విస్తరిస్తున్నాయి. పరవాడలో వందల సంఖ్యలో వీధి కుక్కలు సంచరించడంతో స్థానికులు తరచూ వాటి బారిన పడి ప్రమాదాలకు గురవుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని పరవాడ వాసులు కోరుతున్నారు.

జ్ఞాన సరస్వతి విగ్రహావిష్కరణ



మాధవధార హైస్కూల్‌లో జ్ఞాన సరస్వతి విగ్రహం



మాట్లాడుతున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

మద్దిపాలెం: శ్రావణ పౌర్ణమి సందర్భంగా గురువారం 50వ వార్డు మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జ్ఞాన సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు పొన్నాడ అప్పారావు మాస్టర్, సుజాత దంపతులు తమ సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని ముఖ్య అతిథులు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ హనుమంతు లజపతిరాయ్, కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎక్కడ సరస్వతీదేవి కొలువై ఉంటుందో అక్కడ విద్యార్థులకు ఉన్నత విద్య లభిస్తుందని, తద్వారా పైస్థాయికి చేరుకుంటారన్నారు. ఇదే స్కూల్‌లో డ్రిల్ మాస్టర్‌గా విధులు నిర్వహించిన అప్పారావు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. లజపతిరాయ్ మాట్లాడుతూ స్కూల్ ఆవరణలో చదువుల తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించడం స్వయంగా ఆమె ఇక్కడ జన్మించినట్టు అనిపిస్తోందన్నారు. కార్పొరేటర్ ప్రసాద్ మాట్లాడుతూ తన వార్డులోని పాఠశాలలో జ్ఞాన సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో సరస్వతీదేవిని దర్శించుకుని జగనన్న లక్ష్యాన్ని చేరుకుని, ఇంగ్లిష్, క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పేడాడ రమణికుమారి, పైడి శ్రీను, సనపల నారాయణ స్వామి, పైడి ప్రతాప్, ఏఎస్ నాయుడు మాస్టర్, పొన్నాడ రాంబాబు, వేణు, శివరాం, మురళీధర్, పొన్నాడ మాధవ్, పైడి కృష్ణారావు మాస్టారు, పాఠశాల హెచ్‌ఎం బ్రహ్మాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలోనూ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రావణ మాసం.. ప్రత్యేక కుంకుమ పూజలు

కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న శ్రావణలక్ష్మి పూజలు గురువారం 15వ రోజుకి చేరాయి. వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రావణలక్ష్మి ప్రత్యేక పూజలు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు గురు, శుక్రవారాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, తిరిగి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు.

5 నుంచి కృష్ణాష్టమి వేడుకలు

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు లక్ష్మీనరసింహనగర్‌లోని గోపీజన వల్లభస్వామి ఆలయంలో ఈ నెల 5, 6 తేదీల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 5న సాయంత్రం 5.30 గంటలకు శోభాయాత్ర, 6న ఉదయం 6.30 గంటలకు స్వామికి క్షీరాభిషేకం, ఉదయం 8.30 గంటల నుంచి సహస్ర నామార్చన, విష్ణుసహస్రనామ పారాయణం, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన కార్యక్రమం జరుగుతాయని చెప్పారు. సాయంత్రం 4 గంటలకు స్వామికి 108 రకాల ప్రసాదాలతో నివేదన, సాయంత్రం 5 గంటలకు ఊంజల్ సేవ, 5.30 గంటలకు బాలకృష్ణుడి వేషధారణ పోటీలు, 6.30 గంటల నుంచి సరస్వతి నృత్యమందిర్ వారి నృత్యప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. భక్తులంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్‌కు విద్యార్థుల విరాళం



చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధికి చెక్కు అందిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లో శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్ విద్యార్థులు చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్‌కు భారీ విరాళం అందజేశారు. ఆరిలోవలో ఎస్.సుబ్బలక్ష్మి అనే మహిళ నిర్వహిస్తున్న ఈ ఫౌండేషన్‌కు విరాళం అందజేయడానికి శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్ విద్యార్థులు ముందుకొచ్చారు. ఈ మేరకు 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఇటీవల రూ.2,44,552 వరకు విరాళాలు సేకరించారు. ఆ నగదును చెక్కు రూపంలో గురువారం పాఠశాలలో ఆరిలోవ సీఐ సోమశేఖర్ సమక్షంలో ఫౌండేషన్ ప్రతినిధి ఎస్.సుబ్బలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను సీఐ అభినందించారు. చిన్నతనం నుంచే ఇతరులకు సహాయం చేయాలనే ఆలోచన కలగడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధినేత ముని మోహన్‌కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

2న 'నీ స్నేహం కోసం..'

దాబాగార్డెన్స్: ప్రముఖ గిటారిస్ట్ కన్నాజీ స్మారకార్థం 2వ తేదీన అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'నీ స్నేహం కోసం' పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు సుప్రీం అర్కెస్ట్రా ఇంటర్నేషనల్ లైవ్ బ్యాండ్ అధినేత డాక్టర్ సుప్రీం శేఖర్ తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుప్రీం శేఖర్ మాట్లాడుతూ అనేక సినీ సంగీత కార్యక్రమాల్లో గిటార్ వాయిద్యంతో ఖ్యాతిగాంచిన కన్నాజీ జ్ఞాపకార్థం నిర్వహించనున్న సినీ సంగీత విభావరిలో ప్రముఖ గాయకుడు డేవిడ్, నందిత, రాజేంద్రప్రసాద్, రమేష్ పట్నాయక్, సునీత, అబిద్, అలీ తదితరులు తెలుగు, హిందీ చిత్ర గీతాలు ఆలపిస్తారని చెప్పారు. ప్రత్యేక సంగీత వాయిద్యాలతో సీనియర్ కళాకారులు అలరించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పారుల్‌కుమార్, నేవీ చిల్డ్రన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సంజయ్‌కుమార్ పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా కన్నాజీ తల్లి వసుంధరాదేవిని సత్కరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, గాయకులు రాజేంద్రప్రసాద్, నందిత, కీబోర్డు ఆర్టిస్ట్ సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

2 వేల మొక్కలు నాటిన హెచ్‌పీసీఎల్



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఈడీ రతన్‌రాజ్

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా అధికారులు గురువారం సుమారు 2 వేల మొక్కలను నాటారు. పంచభూతాలైన ఆకాశం, గాలి, అగ్ని, నీరు, భూమితో మనిషి పొందుతున్న ఉపయోగాలను పంచతత్వం కామహారత్న థీమ్‌లో అధికారులు గుర్తు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెచ్‌పీసీఎల్ ఈడీ రతన్‌రాజ్ పాల్గొని ఐఎస్ఎస్ డేగా ప్రాంతంలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ జిల్లా అటవీ శాఖ మార్గదర్శకాలను తీసుకుని ఈ మొక్కలను నాటామని చెప్పారు. ఇక్కడ 52 ఎకరాల విశాలమైన భూమిలో సుమారు 20 వేల మొక్కలను నాటే యోచనలో ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వి.బి.రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా సుబ్రహ్మణ్యేశ్వరరావు ఎంపిక



సుబ్రహ్మణ్యేశ్వరరావు

సింహాచలం: ఈ నెల 5న గురుపూజ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారానికి లెక్చరర్ కేడర్‌లో పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకుడు కె.వి.ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు ఎంపికయ్యారు. విజయనగరం జిల్లా ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఆయన పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు 2020లో డిప్యుటేషన్‌పై వచ్చారు. ఇన్‌స్టిట్యూషన్ డెవలప్‌మెంట్, లేబరేటరీ డెవలప్‌మెంట్ యాక్టివిటీస్‌లో, పలు వర్క్‌షాప్‌ల నిర్వహణలో సుబ్రహ్మణేశ్వరరావు ప్రతిభ చూపారు. 2022లో జరిగిన రీజినల్ టెక్‌ఫెస్ట్ కాంపిటీషన్‌లో సుబ్రహ్మణ్యేశ్వరరావు టీచింగ్ చేసిన పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాల బ్యాచ్ విద్యార్థులు ప్రథమ బహుమతిని సాధించారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజనకు సంబంధించి కోర్సులకు కళాశాలలో ట్రైనర్‌గా కూడా పనిచేస్తున్నారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారిగా ఉంటూ విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ రావడంలో కృషి చేశారు. దాదాపు 90 మంది స్టూడెంట్లు పలు సంస్థల్లో ఉద్యోగాలు సాధించేందుకు దోహదపడ్డారు.

సందడిగా స్పోర్ట్స్ డే



విజేతలైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, కళాశాల యాజమాన్యం

సింహాచలం : శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని పెందుర్తి వెల్ఫేర్ పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జోషువా అరుమ్‌బకమ్ తెలిపారు. కళాశాలలో గురువారం స్పోర్ట్స్ డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్రికెట్, త్రోబాల్, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థులకు అవసరమన్నారు. అన్ని కళాశాలల యాజమాన్యాలు పిల్లల ఫిట్నెస్‌పై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా క్రికెట్‌లో విజేతలుగా నిలిచిన సంజీత్ టీమ్, సుస్వాగత్ టీమ్, వాలీబాల్ విజేతలు మేఘ నాథ్, సతీష్ టీమ్, త్రోబాల్ విజేతలు జ్యోతీ టీమ్, ఖోఖో విజేతలు స్రవంతి, మణి టీమ్‌లను అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీడీలు రమణారావు, అజయ్, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ



మరిడిమాంబను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, స్థానిక నేతలు



మరిడిమాంబ సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే బండారు

పరవాడ: పరవాడ గ్రామంలో కొలువుదీరిన శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాన్ని గ్రామ ప్రజలు గురువారం వైభవంగా జరుపుకున్నారు. వేకువ జాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయటానికి ఆలయం వద్ద బారులు తీరారు. అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి పూజలు జరిపి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు పుష్కలంగా ఉండాలని, ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు, సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పార్టీ నాయకులు చల్లా కనకారావు, రెడ్డి శ్రీనివాసరావు ఉన్నారు. శ్రీ మరిడిమాంబ పండగలో భాగంగా పెందుర్తి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారిని పరవాడ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైల జగన్నాథరావు, టీడీపీ నాయకులు వియ్యపు చిన్న, పి.సన్యాసిరావు, పైల రామచంద్రరావు, పైల బుజ్జి, పైల చినఅక్కునాయుడు తదితరులు ఉన్నారు.

సృజనాత్మకతే సంపద



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న రెక్టార్ ఆచార్య సమత

ఏయూ క్యాంపస్: సృజనాత్మకతే పెద్ద సంపద అని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత తెలిపారు. ఏయూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'అంకుర సంస్థల దిశగా యువత సామర్థ్యాల పెంపు'అనే అంశంపై గురువారం ఒక రోజు సదస్సు నిర్వహించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఆర్.విజయశాంతి స్మారకార్థం ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ సంక్లిష్ట విధానాల్లో ఆలోచించడం, డిజైనింగ్ చేయడం, స్టార్టప్స్‌ను స్థాపించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగడం లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఏ హబ్ మేనేజర్ దివాకర్ స్టార్టప్స్ విస్తృతి, ప్రగతి, అనుకూల పరిస్థితులను వివరించారు. డాక్టర్ రవి సరిపల్లి డిజైన్ థింకింగ్ అంశంపై డాక్టర్ విజయశాంతి స్మారకోపన్యాసం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా యువత నుంచి 44 నవ్య ఆలోచనలు వచ్చాయి. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొని తమ నవ్య ఆలోచనలను పంచుకున్నారు. విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు, బీవోఎస్ చైర్‌పర్సన్ ఆచార్య కె.రమాసుధ, ఆర్.వి.ఎస్.మూర్తి, పి.కాంత ప్రసాద్, డాక్టర్ కె.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ చాలెంజ్‌లో మధురానగర్ హైస్కూల్ ఫస్ట్



ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శాంతికుమారి

సీతంపేట: రాష్ట్రస్థాయి స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ గ్రాండ్ ఫినాలేలో మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. పాఠశాల విద్యా శాఖ, యూనిసెఫ్ సంయుక్తంగా ఆగస్ట్ 28 నుంచి 30 వరకు విజయవాడలో నిర్వహించిన ఈ పోటీలో సీతంపేట మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు దుర్గా కాత్యాయిని, జోష్ నాగేంద్ర, జశ్వంత్, ప్రదీప్‌కుమార్ 'సెక్యూరింగ్ ఫారమ్స్ ఫ్రం యానిమల్స్ యూజింగ్ లేజర్ టెక్నాలజీ' అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. విజయవాడలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ చేతుల మీదుగా ట్రోఫీ, లక్ష రూపాయల నగదు బహుమతి, సర్టిఫికెట్‌ను విద్యార్థులు అందుకున్నారు.

విద్యార్థులకు అభినందనలు

ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన సభలో హెచ్‌ఎం పి.శాంతికుమారి, ఉపాధ్యాయ సిబ్బంది ప్రతిభ చూపిన విద్యార్థులను, ప్రాజెక్టు రూపకల్పనలో గైడ్‌చేసిన సైన్స్ టీచర్ ఎం.ఎ.భ్రమరాంబను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట పొలాల్లోకి జంతువులు వచ్చినపుడు లేజర్ లైట్ ద్వారా సిగ్నల్ వెళ్లి అలారం మోగడంతో పంటను వాటి బారి నుంచి కాపాడుకునేలా విద్యార్థులు ప్రాజెక్టు రూపొందించారన్నారు. ఇటీవల అలిపిరి మెట్ల మార్గంలో చిరుతపులి వచ్చిన సంఘటన జరిగిందని, దాని నుంచి రక్షణగా మెట్ల మార్గానికి ఇరువైపులా లేజర్ లైట్స్ సాయంతో అలారం మోగేలా చేయొచ్చని విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టును చూసి న్యాయనిర్ణేతలు మొదటి బహుమతి ప్రకటించారన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన 27 పాఠశాలలు ఈ తుది పోటీలో పాల్గొనగా తమ పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి సాధించడం చాలా గర్వంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఆవిష్కరణలు చేపట్టాలని ఆకాంక్షించారు.